1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | మార్చి 22, 2024 | www.navatelangana.com

రేవంత్‌రెడ్డిని కలిసిన కంది శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి జిల్లా ముఖ్యనేతలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి నివాసాన్ని సందర్శించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద ఆయనతో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలు, సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వాటికి సీఎం సానుకూలంగా స్పందించారు. అలాగే రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై సీఎం రేవంత్‌రెడ్డి వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి సీతక్క, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ ఆశవాహ అభ్యర్థి ఆత్రం సుగుణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-తలమడుగు

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను తలమడుగు మండల బీఆర్ఎస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మండలంలోన నెలకొన్న సమస్యలను వివరించారు. పలు గ్రామాలకు రోడ్డు సౌకర్యం, ముురుగు కాలువల నిర్మాణం, బీటీ రోడ్ల రోడ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. మండలంలోని దేవాపూర్ నుంచి లచ్చంపూర్, కజ్జర్ల నుంచి పొన్నారి, అదేవిధంగా కజ్జర్ల నుంచి ఖోడద్ గ్రామం వరకు బీటీ రోడ్లు మంజూరు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, గజానన్, రాజేశ్వర్, పొచ్చన్న, పార్టీ మండల ఉపాధ్యక్షులు మగ్గిడి ప్రకాష్ ఉన్నారు.



కారు దిగేస్తున్నారు..!

- గులాబీ గూటిని వీడుతున్న కీలక నాయకులు
- కాంగ్రెస్‌లో చేరిన నిర్మల్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి గడ్డు పరిస్థితి
- లోక్‌సభ ఎన్నికల వేళ ఆ పార్టీ శ్రేణుల్లో కలవరం
- నాయకుల వలసలపై దృష్టిసారించని అధిష్టానం

గత ఎన్నికలకు ముందు కారెక్కేందుకు వరుస కట్టిన నాయకులు.. అధికారం కోల్పోగానే ఆ కారు దిగేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో నాయకుల చేరికతో నిండుగా కనిపించిన బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం గడ్డుకాలాన్ని ఎదుర్కొంటోంది. ఇన్నాండ్లు ఆ పార్టీలో కీలక నాయకులుగా ఉన్న వారు తాజాగా ఒక్కొక్కరుగా ఇతర పార్టీల్లోకి వెళ్లిపోతున్నారు. ఇన్నాండ్లు ఆ పార్టీలో వివిధ పదవులు అనుభవించిన నేతలతో పాటు అసంతృప్తితో ఉన్నవారు సైతం కారు దిగేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలువురు కీలక నాయకులు కాంగ్రెస్, బీజేపీలో చేరగా.. మరికొందరు సైతం అదే బాటలో పయనించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల వేళ కీలక నేతలు వలస బాటపట్టడంతో ఆ పార్టీ శ్రేణులను కలవరపెడుతున్నాయి. ఎక్కువ మంది నేతలు అధికార పార్టీ వైపు మొగ్గుచూపుతుండటం ఆసక్తికరంగా మారుతోంది. నాయకుల వలసతో గులాబీ పార్టీలో నిరుత్సాహం కనిపించగా.. చేరికలతో కాంగ్రెస్‌లో మాత్రం ఉత్సాహం కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. గులాబీ అధిష్టానం సైతం వలసల నివారణపై దృష్టిసారించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో అధికారం కోల్పోగానే గులాబీ పార్టీలో వరుస పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇన్నాండ్లు వివిధ పదవుల్లో ఉన్న కీలక నాయకులతో పాటు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్, బీజేపీలో చేరుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి..కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పలు మున్సిపాలిటీలు హస్తం గతం కాగా.. పలు మండలాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. పదవులు కాపాడుకోవడం కోసం కొందరు.. రాజకీయ భవిష్యత్తుపై ఆశతో మరికొందరు అధికార పార్టీలో చేరేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గులాబీ గూటిని వీడి కాంగ్రెస్ చేరగా.. బుధవారం మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ హస్తం కండువా కప్పుకున్నారు. తాజాగా గురువారం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు, ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సైతం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో తీర్థం పుచ్చుకోవడం చర్చనీయాంశంగా మారింది. మరోపక్క మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సైతం కాంగ్రెస్‌లో చేరబోతున్నారని జోరుగా ప్రచారం జరుగుతున్నా.. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన చేరికను వ్యతిరేకిస్తున్నట్లు తెలిసింది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన గోడం నగేష్ ఇటీవల బీజేపీలో చేరి ఆ పార్టీ తరపున లోక్‌సభ బరిలో నిలుస్తున్నారు. ఇప్పటికే పలు మండలాలకు చెందిన కీలక నాయకులు కారు దిగి కాంగ్రెస్, బీజేపీలో చేరుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఖాళీ అవుతున్న కారు..!

తెలంగాణ ఉద్యమ కాలంతో పాటు పదేండ్ల పాటు అధికారంలో కొనసాగిన ఆ పార్టీలో నాయకులకు కొదువలేని పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో ఒక ఎంపీ..పది మంది ఎమ్మెల్యేలు, నలుగురు జడ్పీ ఛైర్‌పర్సన్లు,ఎమ్మెల్సీల వంటి కీలక పదవులతో పాటు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సైతం దాదాపు ఆ పార్టీకి చెందినవారే ఉన్నారు. అక్కడక్కడ కాంగ్రెస్, బీజేపీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు మాత్రమే ప్రాతినిధ్యం వహించారు. తప్పితే అందరూ బీఆర్ఎస్ వారే ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆ పార్టీ పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. అధికారం కోల్పోగానే కారు దిగేవారే కానీ..ఎక్కేవారు కనిపించని పరిస్థితి నెలకొంది. ఇటీవల కోటపల్లి, తాంసి తదితర మండలాల చెందిన కీలక నాయకులు అనేక మంది ముకుమ్మడిగా కాంగ్రెస్, బీజేపీలో చేరారు. లోక్‌సభ ఎన్నికల వేళ నేతల వలసలు ఆ పార్టీ శ్రేణులను కలవర పెడుతున్నాయి.

ఎన్నికల నాటికి మరి కొందరు కీలక నాయకులు కాంగ్రెస్ గూటికి చేరుతారని ప్రచారం జరుగుతోంది. ఒక్కొక్కరుగా కీలక నాయకులు ఇతర పార్టీల్లో చేరుతున్నా ఆ పార్టీ అధిష్టానం వీటిపై దృష్టిసారించడం లేదని తెలుస్తోంది. పార్టీ మారుతున్న నాయకులను పిలిచి మాట్లాడే పరిస్థితి కనిపించడం లేదని ఆ పార్టీవర్గాలు చెబుతున్నాయి.

తప్పుడు సమాచారం వైరల్ చేస్తే కఠిన చర్యలు

- పరీక్షా కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదవ తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతోందని సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని వైరల్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం పట్టణంలోని బాలికల ఉన్నత పాటశాల పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి సందర్శించారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం వారికి కల్పించిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉట్నూర్‌లో ఉర్దూ పేపర్ లీక్ అయిందని, మాస్ కాపియింగ్ జరుగుతుందని సోషల్ మీడియాలో వైరల్ అయిందన్నారు. దీనిపై అక్కడి ఎంఈవోతో విచారణ చేయించడం జరిగిందని, అలాంటిదేమి లేదని తెలిసిందన్నారు. ఫేక్ న్యూస్‌ను వ్యాప్తి చేసిన వారిపై చర్యలుంటాయన్నారు. జిల్లాలోని 53 కేంద్రాల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

తప్పుడు సమాచారాన్ని వైరల్ చేసిన ముగ్గురిపై ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. వ్యక్తిగత కక్షల కారణాలతోనే సోషల్ మీడియా ద్వారా ఓ వ్యక్తి మాస్ కాపీయింగ్ జరుగుతుందని ప్రచారం చేశాడని తమ విచారణలో తెలిందన్నారు. ఇలాంటి తప్పుడు సమాచారం సోషల్ మీడియా ద్వారా అందిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వారి వెంట ఎంఈఓ జయశీల, డీఎస్పీ జీవన్‌రెడ్డి, విద్యాధికారులు ఉన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

వడగాండ్ల వానకు దెబ్బతిన్న పంటలను సమగ్రంగా పరిశీలన చేసి, రైతులకి ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న అన్నారు. ప్రస్తుత రబీలో వేసిన పంటలకు గత మూడు, నాలుగు రోజుల కింద కురిసిన వడగాండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఇందులో భాగంగా మండల కేంద్రానికి చెందిన గుర్ల శ్రీనివాస్, గుర్ల విలాస్ అనే రైతులు తనకు ఉన్న వ్యవసాయ భూమిలో మూడు ఎకరాల మొక్క జొన్న, రెండు ఎకరాల తెల్లజొన్న పూర్తిగానే నెలకొరిగిందని, అంతేకాకుండా జాతర్ల, దేగామ గ్రామాల్లో వేసిన రబీ పంటలు తెల్లజొన్న, మొక్కజొన్న, గోధుమ, నువ్వులు, నష్టపోయిన పంటలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించేందుకు కృషి చేయాలని అన్నారు. జిల్లాలో దాదాపుగా 2వేల ఎకరాల వరకు పైగా పంటలు నష్టపోయాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు వినాయక్, లక్ష్మణ్, కిష్టు, సంతోష్ పాల్గొన్నారు.

మానిటరింగ్ కమిటీతో ట్రైనీ కలెక్టర్ సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సహాయ కలెక్టర్ వికాస్ మహతో తన ఛాంబర్‌లో ఎంసీఎంసీ మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పెయిడ్ న్యూస్, సోషల్ మీడియా, ప్రింట్ మీడియా, ప్రీ సర్టిఫికేషన్ ఆఫ్ అడ్వర్టైజ్‌మెంట్‌లో వచ్చే అంశాలపై మాస్టర్ శిక్షకులు లక్ష్మణ్ అవగాహన కల్పించారు. ఎంసిఎంసి సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం తదితర అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థి చేసిన ప్రతి ఖర్చును లెక్కలో చూపించాలని, దీనికి సంబంధించి సెక్షన్ డిలో స్పష్టంగా పేర్కొనడం జరిగిందని, ఆ మేరకు రోజువారీ ఖర్చు వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు.

పదేండ్ల సంక్షేమ పథకాలు ప్రచారం చేయాలి

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు




నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపుకు దగ్గరలో ఉందని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్నతో కలిసి నాయకులు సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యాలయానికి తొలిసారి రావడంతో వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్‌తో పాటు కౌన్సిలర్లు పులమొక్కను అందించి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలను అమలు చేశారన్నారు. ఆ పథకాలు ప్రజలకు గుర్తున్నాయని తెలిపారు. పేదల ఆకాంక్షల మేరకే తమ పాలన సాగిందన్నారు. విభజన సమయంలో కేంద్రంలోని బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. సీసీఐ పునరుద్ధరణ, యూనివర్సిటీ, టెక్స్‌టైల్ పార్కు పదేండ్ల కాలంలో ఎది కూడా ఆదిలాబాద్‌కు ఇవ్వలేదని ఆరోపించారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. తాము చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తనను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినందుకు మాజీ సీఎం కేసీఆర్‌కు ధన్యవాదలు తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మాట్లాడుతూ పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. ఇది వరకే ఏడు నియోజకవర్గాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించామన్నారు. ఎన్నికల వ్యూహాలను రచించడం జరిగిందని పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పూసపూరిత వాగ్దానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాజిదొద్దీన్, ప్రకాష్, నర్సింగ్, భారత్, అశ్రఫ్, పండ్ల శ్రీను, మోబిన్, నారాయణ, రాము పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఆత్రం సుగుణ

- కండువా వేసి ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి
- పీవీటీజీ ఏపీఓ ఆత్రం భాస్కర్ సైతం హస్తం పార్టీలో చేరిక



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ లోక్‌సభ బరిలో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉంటారని భావిస్తున్న ఆత్రం సుగుణ గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆమెకు కాంగ్రెస్ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమె పేరునే ఆ పార్టీ అధిష్టానం ఫైనల్ చేసినట్లు తెలిసింది. దీంతో ఉపాధ్యాయ ఉద్యోగానికి ఆత్రం సుగుణ ఈ నెల 11న రాజీనామా సమర్పించారు. 12వ తేదీన ఆమోదం పొందినట్లు తెలిసింది. త్వరలోనే ఆ పార్టీ అధిష్టానం అభ్యర్థులను ప్రకటించనుంది. ఆ సమయంలోనే అధికారికంగా ఆమె పేరును వెల్లడించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోపక్క కాంగ్రెస్ టికెట్ ఆశించిన పీవీటీజీ ఏపీఓ ఆత్రం భాస్కర్ కూడా సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ నెల 19వ తేదీన ఉద్యోగానికి రాజీనామా చేసిన ఆయన సైతం హస్తం కండువా కప్పుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఇద్దరిలో పార్టీ ఎవరికి టికెట్ కేటాయించినా కలిసి పనిచేయాలని ఇరువురు నేతలకు సీఎం సూచించినట్లు తెలిసింది.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలి

నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గంలోని సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం మండల కేంద్రంలో అన్ని శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నియోజకవర్గ కేంద్రంలోని మోడల్ కోడ్ నిర్వహణ, పోలింగ్ కేంద్రాలలో కనీస వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో నీటి వసతి, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, సెక్టార్ అధికారులు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



నూతన ఐప్యాడ్ ఇచ్చే వరకూ కుటుంబ సర్వే అసాధ్యం



నవతెలంగాణ -ఖానాపూర్

అంగన్వాడీలకు నూతన ఐప్యాడ్‌లు ఇచ్చేవరకు కుటుంబ సర్వేలు నిర్వహించడం సాధ్యం కాదని సిఐటియు జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. ఈ విషయమై గురువారం అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో సీడీపీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేండ్ల క్రితం ఇచ్చిన ఫోన్లలో ఫ్యామిలీ సర్వే చేయమని అధికారులు ఒత్తిడి చేయడం మానుకోవాలన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కొన్ని సంవత్సరాలుగా అనేక రకాల పోరాటాలు నిర్వహించినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యలను పరిష్కరించకుండా పక్కదారి పట్టిస్తున్నాయని విమర్శించారు. వేసవి సెలవులు, ఒక్క పూట కొరకు అనేక పోరాటాలు చేసిన ఫలితంగా ప్రభుత్వం దిగొచ్చిందన్నారు. మే నెలలో నెలరోజుల పాటు ఆయా, టీచర్‌కు సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారం ఉన్న బిజెపి ప్రభుత్వం ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తోందని, అందులో భాగంగానే బడ్జెట్‌లో 60 శాతం నిధులను తగ్గించిందని తెలిపారు. దేశంలో పౌష్టికారలోపంతో 100 కోట్ల మంది బాధపడుతున్నారని అంతర్జాతీయ సర్వేలు చెబుతున్నా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వానికి మాత్రం చెవికెక్కడం లేదని విమర్శించారు. ఐసిడిఎస్‌ను బలోపేతం చేస్తే తప్ప పౌష్టికార లోపాలను అధిగమించడం అసాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ఖానాపూర్ ప్రాజెక్ట్ అధ్యక్షులు పి విజయ, ఎస్.భాగ్య, ఉపాధ్యక్షులు, గీతాంజలి, పద్మ, సహాయ కార్యదర్శులు మునేంద్ర, రామలక్ష్మి, రాజేశ్వరి, రేఖ, సంధ్య, ప్రమీల, సత్యక్క పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా చర్యలు చేపట్టి విస్తృత తనిఖీలు నిర్వహించాలని, నగదు, మద్యం రవాణాను నియంత్రించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తో కలసి ఇంటర్ స్టేట్ చెక్ పోస్ట్ బొరజ్, పిప్పర్‌వాడ టోల్ ప్లాజా చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది విధులు నిర్వహణ, ఎన్ని వాహనాలు తనిఖీ చేసింది అని అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల తనిఖీ సంబంధించి రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. ప్రతి చెక్ పోస్ట్‌లో వీడియోగ్రఫీకి చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అప్రమత్తంగా ఉంటూ, 24 గంటల పటిష్ట నిఘా పెట్టాలని అన్నారు. ఈ సందర్భంగా ఏసీ స్లీపర్ బస్‌లో ప్రతీ సీటును, వెహికిల్స్‌ను స్వయంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆర్టీఓ అధికారులు, తహసీల్దార్ శ్యాంసుందర్ ఉన్నారు.

జేసీబీతో డ్రైనేజీలో చెత్త తొలగింపు

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని ఐదో వార్డులోని బస్టాండ్ ఏరియాలో, టవర్స్ కాలనీలో పాత డ్రైనేజీ కూలిపోయి మురుగు నీరు వెళ్లకుండా దుర్గంధంగా మారడంతో గురువారం స్థానిక కౌన్సిలర్ పరిమి లత సురేష్ జేసీబీ సహాయంతో డ్రైనేజీలోని చెత్తను శుభ్రం చేయించారు. డ్రైనేజ్ నీరు నిలువ అవడంతో దోమలు బెడదతో ప్రజలకు డెంగ్యూ, మలేరియా, జ్వరాలు రాకుండా ఉండటానికి ముందు జాగ్రత్త చర్యగా అపరిశుభ్రంగా ఉన్న డ్రైనేజీలను సొంత ఖర్చులతో శుభ్రం చేయించారు.



కార్మికులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీ సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని ఆర్టీసీ ఆర్ఎం సొలొమాన్ అన్నారు. గురువారం ఆర్టీసీ ఎండీ ఆదేశాల మేరకు మధ్యాహ్నం సమయంలో ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో ఉద్యోగులందరికీ మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఈ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం ఉద్యోగులకు పంపిణీ చేస్తూ, విధుల పట్ల ఎలా అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉంటారో ఆరోగ్యం పట్ల అలాగే ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ ప్రణీత్, ఆర్ఎంఎం ప్రవీణ్ కుమార్, డిపో మేనేజర్ కల్పన ఉన్నారు.



భద్రతాభావం పెంపొందించేందుకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహణ

- ఆదిలాబాద్ ఎస్పీ గౌస్‌ఆలం
- పట్టణంలో ఫ్లాగ్ మార్చ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఫ్లాగ్ మార్చ్ ప్రజలలో భద్రతాభావం పెంపొందించేకే నిర్వహించబడతాయని, ప్రజలు ఎటువంటి భయాందోళనకు లోనవ్వకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించబడతాయని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం తెలియజేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లాకు చేరుకున్న కేంద్ర సీఆర్పిఎఫ్ బలగాలు, జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని కలెక్టర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫ్లాగ్ మార్చ్‌ను జిల్లా ఎస్పీ గౌస్ఆలం జెండా ఊపి ప్రారంభించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ పట్టణంలోని ప్రధాన కూడళ్ల ఎన్టీఆర్ చౌక్, వినాయకచౌక్, నేతాజీ చౌక్, అంబేద్కర్ చౌక్, గాంధీచౌక్, దేవిచంద్ చౌక్, వన్ టౌన్ మీదుగా వినాయక చౌక్ మీదుగా ఎన్టీఆర్ చౌరస్తాలో ముగిసింది. సీఆర్పిఎఫ్ సిబ్బంది ముఖ్యంగా ఎన్నికల్లో కీలక విధులైన ఈవీఎంల భద్రత, చెక్‌పోస్టులు నిర్వహణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో విధులు, వీవీ పాట్‌ల వద్ద భద్రత, స్ట్రాంగ్ రూములలో విధులు నిర్వహిస్తుంటారని పేర్కొన్నారు. విధుల్లో అప్రమత్తంగా ఉండి, ఎటువంటి సమస్యాత్మక సందర్భమైన సంభవించినప్పుడు వెంటనే ఉన్నతాధికారులకు కానీ స్థానిక పోలీసులకు కానీ తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఆర్పిఎఫ్ కమాండెంట్ శ్రీకాంత్, పట్టణ సీఐలు సత్యనారాయణ, అశోక్, శ్రీనివాస్, ఫణిధర్, సాయినాథ్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ నవీన్, జిల్లా ఎస్సైలు రిజర్వ్ సిబ్బంది, సీఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు రైతుబజార్ మూసివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని రైతుబజార్‌ను ఈనెల 22 శుక్రవారం, 23 శనివారం తేదీలలో మూసి వేయడం జరుగుతుందని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుబజార్ లో పారిశుధ్య నిర్వహణ పనులు ఉన్నందువలన మూసి వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు, రైతు సోదరులు, డ్వాక్రా, కొనుగోలుదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎంపీ గెలిపే లక్ష్యంగా పని చేస్తాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లో ఎంపీ అభ్యర్థి గెలిపే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం ముందుండి పనిచేస్తుందని పట్టణ మహిళా కార్యదర్శి స్వరూపారాణి, కరుణ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా నియమితులైన ఆత్రం సక్కును గురువారం పార్టీ కార్యాలయంలో స్వరూపారాణి, కరుణ కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి, అభినందనలు తెలిపారు. మాజీ మంత్రి జోగు రామన్న నాయకత్వంలో ఆదిలాబాద్ బీఆర్ఎస్ మహిళా విభాగం ముందుండి పని చేస్తుందని పేర్కొన్నారు.

పది పరీక్షకు 36 మంది గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం నిర్వహించిన పరీక్షకు 36 మంది గైర్హాజరైనట్టు డీఈఓ ప్రణీత తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 10,407 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 10,371 మంది విద్యార్థులు హాజరైనట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే జిల్లా వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాలను ఉన్నతాధికారులు తనిఖీ చేశారు.

రేపు నియోజకవర్గంలో మంత్రి సీతక్క పర్యటన

నవతెలంగాణ-ఉట్నూర్

23న ఖానాపూర్ నియోజకవర్గంలో మంత్రి సీతక్క పర్యటన ఉంటుందని గురువారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని జేకే ఫంక్షన్ హాల్లో ఉదయం 11గంటలకు నిర్వహించే నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశానికి పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ధనసరి సీతక్క హాజరవుతున్నారని తెలిపారు. ఖానాపూర్ నియోజవర్గంలోని అన్ని మండలాల, గ్రామస్థాయి, బూత్ స్థాయి, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వీప్ ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారి ఓటు వేయనున్న కళాశాల విద్యార్థినులకు పోలింగ్‌పై నిర్వహించిన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఓటు హక్కు అనేది దేశ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన గొప్ప వరమని అన్నారు. ప్రతి ఓటరు మే 13న పోలింగ్ రోజున విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. యువత తాము ఓటు వేయడమే కాకుండా కుటుంబ సభ్యులు ఓటు వేసేలా ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజెయాలంటూ ఎన్నికల ప్రక్రియను వివరించారు. ఓటు హక్కును వినియోగించుకుంటే బలమైన ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినవారు అవుతారని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నచ్చకపోతే ఎన్నికల సంఘం నోటా అనే అవకాశాన్ని కల్పించిందని అన్నారు. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల్లో నూతనంగా 7,078 మంది ఓటర్లు తొలిసారి తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఓటింగ్ శాతం పెరగడానికి యువత కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నమూనా ఓటింగ్ మిషిన్ పనితీరును విద్యార్థులు పరిశీలించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఆయా కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణం సమతుల్యంగా ఉండాలంటే చెట్లుండాలి

- ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పర్యావరణం సమతుల్యంగా ఉండాలంటే చెట్లుండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్, ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కార్యక్రమంలో చిన్నారులు చేసిన నృత్యాలు పలువురిని అలరించాయి. అనంతరం అతిథులను సత్కరించారు. ఈ సందర్భంగా అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకోని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. చివరగా అటవీ సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అడవుల సంరక్షణకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అడవులు లేని కారణంగా ప్రస్తుతం భూతాపం అనేది పెరుగుతుందన్నారు. రికార్డుల్లో జిల్లాలో 44 శాతం అడవులున్నాయని, కానీ వాస్తవానికి 24 శాతం చెట్లు మాత్రమే ఉన్నాయన్నారు. అడవుల్లో లేని కారణంగా వన్యప్రాణాలు జనవాసాల్లోకి వస్తున్నాయన్నారు. బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. అడవులను కాపాడటంలో అటవీ శాఖ అధికారులు ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. వారి త్యాగాలను స్మరించాల్సిన అవసరముందన్నారు. అదే విధంగా అంతకు ముందు అటవీ శాఖ కార్యాలయం నుంచి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. డీఎస్‌ఓ ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ జెండా ఊపీ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, డీఎస్‌ఓ ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఎఫ్ఎఓ బర్నోబా, ఎస్ఆర్‌ఓ గులాబ్ సింగ్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : అటవీని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని అటవీ రేంజ్ అధికారి అనిత అన్నారు. గురువారం జీవకోటికి ఆశ్రయమిచ్చేవి అడవులు, మానవాళికి ఆక్సిజన్ అందించేవి అడవులు, అడవులను రక్షించండి, పర్యావరణాన్ని కాపాడండి, వక్షో రక్షతి రక్షిత అంటు మండల కేంద్రంలో అటవీ అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌ఓ జాదవ్ గోపాల్, ఎఫ్ఆర్‌ఓ గులాం హైమొద్దీన్, ప్రియాంక అటవీ అధికారులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్



ఉట్నూర్‌లో..

కొనసాగుతున్న గాలికుంటు నివారణ టీకాలు



తలమడుగు



కడెంలో..

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని బరంపూరం గ్రామంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు గురువారం వేసినట్లు పశు వైద్యాధికారి దూద్ రామ్ తెలిపారు. మూగ జీవులు అనేక రోగాల బారిన పడతాయని వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఉండాలని రైతులను కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలకు తమ పశువులను తీసుకువచ్చి చికిత్సలు చేయించుకోవాలని, మండల రైతులను ప్రజలను కోరారు. పశువులు ఉన్న ప్రతి ఒక్కరూ తమ పశువులకు వ్యాధి సోకకుండా, సోకిన వాటికి కూడా టీకాలను తప్పకుండా తమ పశువులకు ఇప్పించాలన్నారు. లక్షలాది విలువ గల మూగజీవుల ప్రాణాలను కాపాడటం కోసం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. పాడి పరిశ్రమను పెంచేందుకు రైతులు కృషి చేయాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పశువైద్య శిబిరంలో గ్రామస్తులు రైతులు కేదారీశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రెడ్డి, దయాకర్, వెంకట్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నార్శు

నార్నూర్ : రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి రజినీకాంత్ అన్నారు. గురువారం గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాజులగూడ, గుంజాల గ్రామంలో రైతుల ఇంటింటా తిరుగుతూ పశువులకు ఉచిత టీకాలు వేశారు. రైతులు గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు కైలాస్, అబ్దుల్ అల్తాఫ్, మాజీ సర్పంచ్ రాథోడ్ సావిందర్, పశు వైద్య సిబ్బంది ప్రభాకర్, సునీల్, కైలాస్, ఓంకార్ ఉన్నారు.

కడెం : ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వన్యప్రాణుల సంరక్షణ చర్యల్లో భాగంగా గ్రామాల్లో పశువులకు ఉచిత వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డీఆర్‌ఓలు సిద్ధార్థ, ప్రకాష్ అన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు నిర్మల్ జిల్లా కడెం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో మండల అటవీశాఖాధికారి అనిత ఆధ్వర్యంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ విజయకుమార్ గ్రామంలోని పశువులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కవ్వాల్ పులుల రక్షిత ప్రాంతంలో వన్యప్రాణులకు గ్రామాల్లో ఉండే పశువుల ద్వారా ఎటువంటి వ్యాధులు సోకకుండా ముందస్తుగా పశువులకు వ్యాధుల నివారణ టీకాలు వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ బీట్ అధికారులు హలీం, సూర్యనారాయణ, రాజు, స్థానిక నాయకులు, రైతులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

నవతెలంగాణ-నార్నూర్

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని సూపర్‌వైజర్ వందన అన్నారు. పోషణ పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని జామడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కిషోర బాలికలకు పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. వయసు లేకుండా, బాల్యవివాహాలు జరిపితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చౌహాన్ నెహ్రూ, పీడీ విశ్వనాథ్, వైద్య సిబ్బంది రాజమ్మ సుశీల, కైలాస్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు సుజాత, బొజ్జు బాయి ఉన్నారు.

కడెం : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని, మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్‌లో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీ సూచించారు. గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు చిన్నారులకు అందించే పౌష్టికాహారం పట్ల వివరించి అవగాహన కల్పించారు. ఐదు సంవత్సరాల్లోపు చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వైద్య సిబ్బంది రేణుక, ఆశా వర్కర్ గోదావరి, సిబ్బంది బుచ్చవ్వ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పొట్టపెల్లి(కె) గ్రామంలో అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలతో చిన్నారులకు, వారి తల్లితండ్రులకు పౌష్టికహారం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, అంగన్‌వాడీ సిబ్బంది సునీత, వైద్య సిబ్బంది భూలక్ష్మి, చిన్నారులు పాల్గొన్నారు.



నార్నూర్‌..



లక్ష్మణచాందలో..

గంగపుత్ర కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని పిప్పల్ కోటి గ్రామ గంగపుత్ర కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రంగని వసంత్‌రావ్, ఉపాధ్యక్షులు సాద్‌గార్ విలాస్, ప్రధాన కార్యదర్శి ఇప్ప నందులను ఎన్నుకున్నారు. నూతన గంగపుత్ర కార్యవర్గం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను నేరడిగొండలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపి కార్యవర్గాన్ని ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులవృత్తి గంగపుత్రా కులస్థులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యువసేన అధ్యక్షులు షేక్ ఆఫ్రోజ్, సంఘం సభ్యులు రమేష్, పెంటన్న, గణపతి, నారాయణ, గంగారాం ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని హీరాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ వసంత్‌రావు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న పవార్ సవాయి రామ్ మెమోరియల్ ఫౌండర్ పవార్ గోకుల్‌దాస్ హెడ్ కానిస్టేబుల్ తన వంతుగా బాధిత కుటుంబానికి రూ.వెయ్యి ఆర్థిక సాయాన్ని అందజేశారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తన వేతనం నుంచి ప్రతి నెల ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి రూ. వెయ్యి అందజేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

రిమ్స్‌లో సీపీఆర్‌పై శిక్షణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అకస్మాత్తుగా ఎవరికైనా గుండెపోటు వస్తే సీపీఆర్ చేసి ఎలా ప్రాణాలు నిలబెట్టాలనే అంశంపై రిమ్స్ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు గురువారం శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ ప్రారంభించారు. రెండు రోజులు సాగే శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, అత్యవసర సమయాల్లో ప్రాణాపాయంలో ఉన్న వారిని కాపాడాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు రాథోడ్ శేశరావ్ సతీమణి రాథోడ్ నీలాబాయి మాజీ ఎంపీటీసీ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్, బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేష్‌తో కలిసి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట నాయకులు రాజు, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, ఫ్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేష్, కైలాస్ పటేల్, గ్రామ పెద్దలు విద్యారాణి ఉన్నారు.

సాఫ్ట్ స్కిల్స్‌పై మూడు రోజుల శిక్షణ ముగింపు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో గత మూడు రోజుల నుంచి టీఎస్‌కేసీ విభాగం ఆధ్వర్యంలో టాస్క్ వారు నిర్వహిస్తున్న సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా శిక్షణలో పాల్గొన్న పలువురు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ శిక్షణ వల్ల జీవితంలో స్థిరపడటానికి కావాల్సిన వివిధ నైపుణ్యాలను ఏ విధంగా మెరుగుపరచుకోవాలో తెలిపిన శిక్షకుడు శ్రీ రామ మనోజ్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ 21వ శతాబ్దంలో విద్యార్థులు స్థిరపడాలంటే తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసే ఇలాంటి శిక్షణా కార్యక్రమాలలో తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. శిక్షణలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నైపుణ్యాలను చూసి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నర్సింగరావు, మెంటర్ ఎండీ ఇమ్రాన్ అలీ, అధ్యాపకులు ఆర్.సంతోష్ కుమార్, డి.దయాకర్, ఎండీ. అష్రఫ్ అలీ, టాస్క్ శిక్షకుడు పి.రామ మనోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఏఎంసీ మాజీ చైర్మన్ రాజీనామా

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్‌కు చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, గుండి ఎంపీటీసీ మల్లేష్ తోపాటు ఆయన అనుచరులు అయిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్యామ్ రావు, మాజీ ఆత్మ చైర్మన్ రమేష్, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు పార్టీ నాయకులు అందరూ బీఆర్ఎస్‌కు ముకుమ్మడి రాజీనామా చేశారు. ఈ రాజీనామా పత్రాన్ని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మికి అందజేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో కాలిన సామాగ్రి

నవతెలంగాణ-కౌటాల



షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామాగ్రి, నిత్యవసర వస్తువులు కాలిబుడిదైన సంఘటన మండలంలోని కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మోర్లె పోచుబాయి ఇంట్లో మండల కేంద్రంలోని మోర్లె పోచుబాయి ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. ఇంట్లో ఉన్న టీవీ, బట్టలు, ఆహార వస్తువులు, దుస్తులు, ఇతర సామాగ్రి కాలిపోయిందని బోరున విలపించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

కాగజ్‌నగర్‌లో మళ్లీ ఉద్రిక్తత

- రోడ్డుకు అడ్డంగా మిల్లు యాజమాన్యం ఏర్పాటు చేసిన రేకుల తొలగింపు
- ఆరు లారీల అద్దాలు ధ్వంసం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో సిర్పూరు పేపర్ మిల్లు యాజమాన్యానికి, మున్సిపాలిటీకి మధ్య నెలకొన్న వివాదం గురువారం మళ్లీ ఉద్రిక్తతకు దారి తీసింది. యాజమాన్య వైఖరిని నిరసిస్తూ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు స్థానిక ఎస్పీఎం క్రీడా మైదానం ముందు ధర్నా చేపట్టారు. దీనికి కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ(ఎం), ఎంఐఎంతో పాటు ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు సంఘీభావం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మున్సిపల్ కౌన్సిలర్లు, అన్ని పార్టీల నాయకులు అక్కడ ధర్నాకు కూర్చున్నారు. డీఎస్పీ కరుణాకర్ వచ్చి సముదాయించే ప్రయత్నం చేసినా వారు వినకుండా యాజమాన్యం రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన రేకులను తొలగించాల్సిందేనని పట్టు పట్టారు. యాజమాన్యం రెండు రోజుల గడువు అడిగిందనీ, ఆ గడువు ముగిసినందున వెంటనే ఆ రేకులను తొలగించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య వెంటనే ఇక్కడికి వచ్చి రేకులను తొలగించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన జెడ్పీ ఇన్‌ఛార్జి చైర్మన్ కోనేరు కృష్ణ యాజమాన్యం తీరుపై మండిపడ్డారు. పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. కమిషనర్ అంజయ్య అక్కడికి రాగా వెంటనే రేకులను తొలగించాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ వారితో మాట్లాడుతున్న సమయంలోనే మిల్లు యాజమాన్య ప్రతినిధులు హైకోర్టు ఆర్డర్ కాపీని తీసుకువచ్చి కమిషనర్‌కు అందించారు. కమిషనర్ ఆర్డర్ కాపీ తీసుకోకుండా కార్యాలయానికి వచ్చి ఇవ్వాలని చెప్పి అక్కడి నుండి వెళ్లిపోయారు. కమిషనర్ వెళ్లిన వెంటనే నాయకులు, కార్యకర్తలు జేసీబీ సహాయంతో రోడ్డుకు అడ్డంగా వేసిన రేకులను తొలగించారు. ఎస్పీఎం క్రీడా మైదానం ముందు రోడ్డుతో పాటు బాలభారతి పాఠశాల ముందు భాగంలోని రోడ్డుకు అడ్డంగా వేసిన రేకులను కూడా తొలగించారు. ఈ క్రమంలో మిల్లుకు ముడిసరుకు తీసుకువచ్చే లారీలు రోడ్డుపై నిలిపి ఉండగా, అందులో ఆరు లారీల అద్దాలను పగ్గులకొట్టారు. ఈ ఘటనలో మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సురేష్ సాంగ్లె కాలుకు గాయమైంది. అనంతరం జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు.



రేకులు తొలగించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ తదితరులు



లారీల అద్దాలు పగులకొడుతున్న కార్యకర్తలు



జేసీబీతో రేకులను తొలగిస్తున్న దృశ్యం



డీఎస్పీతో వాగ్వివాదం చేస్తున్న జెడ్పీ ఇన్‌ఛార్జి చైర్మన్ కోనేరు కృష్ణ

అధ్యాపకుడి తొలగింపు

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల దళిత అధ్యాపకుడు నాగరాజును రిమూవ్ ఫర్ సర్వీస్ చేస్తూ గురువారం ఇంటర్ మీడియట్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. 2011లో కాంట్రాక్టు లెక్చరర్‌గా ప్రభుత్వ కళాశాలలో విధుల్లో చేరారు. గత సంవత్సరం మేనెలలో లెక్చరర్‌లను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాగరాజు ఫేక్ పీజీ సర్టిఫికేట్‌లు సమర్పించారని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బెజ్జూరుకు చెందిన దేవాజీ, నాగేష్ అనే వ్యక్తులు ఇంటర్మీడియట్ బోర్డుకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇంటర్ బోర్డు విచారణ చేపట్టింది. ద్రవిడ యూనివర్సిటీలో పీజీ సర్టిఫికేట్ పొందిన అతనిపై విచారణ చేపట్టిన ఇంటర్ బోర్డు పీజీ సర్టిఫికేట్ ఫేక్ అని తేల్చింది. అతనిపై క్రిమినల్ కేసు నమోదుచేయాలని గత సంవత్సరం బెజ్జూరు ప్రిన్సిపాల్ రాజయ్యకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాజయ్య బెజ్జూరు పోలీస్‌స్టేషన్‌లో నాగరాజుపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు సర్టిఫికేట్‌పై విచారణ చేపట్టారు. పోలీసుల విచారణలో పీజీ సర్టిఫికేట్ సరైనది కాదని నివేదిక అందించడంతో ఇంటర్ బోర్డు చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు బుధవారం రాత్రి నాగరాజును రిమూవ్ ఫర్ సర్వీస్ చేస్తూ ఇంటర్ మీడియట్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసినట్టు డీఐఈఓ శంకర్ గురువారం తెలిపారు. నకిలి పీజీ సర్టిఫికేట్ పొంది విధుల్లో చేరిన నాగరాజును క్రిమినల్ కేసుతోనే వదిలేయకుండా ఇన్ని సంవత్సరాలు ప్రభుత్వ వేతనం పొందిన పూర్తి వేతనాన్ని రికవరీ చేయడంతో పాటు అతనికి మరే ప్రభుత్వ సంస్థలో ఉద్యోగం లభించకుండా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.

వాంకిడి చెక్‌పోస్టు వద్ద రూ.2.25 లక్షలు పట్టివేత



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద గురువారం వాహనాల తనిఖీలో సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న వేరువేరు వ్యక్తుల నుంచి రూ.2.25లక్షలు పట్టుకున్నట్టు ఎస్సై సాగర్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన శ్రీనివాస్‌రావు వద్ద రూ.లక్ష, బల్లార్షాకు చెందిన సంజీవ్ తన కారులో ఆసిఫాబాద్‌కు వెళ్తుండగా రూ.1.25 లక్షలు పట్టుకున్నట్టు వివరించారు. సరైన ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు. ఈ తనిఖీలో కెరమెరి ఏపీఓ అమ్జత్‌పాషా, జూనియర్ అసిస్టెంట్ బాబుభాస్కర్, హెడ్‌కానిస్టేబుల్ శివాజీ ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా అన్నారు. గురువారం మండలంలోని మురళీగూడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్షోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలింతలకు, గర్భిణీలకు, పిల్లలకు ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలో అవగాహన కల్పించారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లకు, ప్రీ స్కూల్ ప్రాముఖ్యత గురించి, గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారు తీసుకొనే పోషకాహారం గురించి వివరించారు. చిరుధాన్యాల వాడకం వల్ల అందే పోషకాల గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని జీఎం కార్యాలయంలో గురువారం రోజున ఉద్యోగులకు నివాస క్వార్టర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఓ టు జీఎం మచ్చగిరి నరేందర్ మాట్లాడుతూ ఉద్యోగుల నివాస గృహాల కేటాయింపు పారదర్శకంగా జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ సివిల్ రాజేంద్రప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ అర్చన పాల్గొన్నారు.

రేపు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి సీతక్క రాక

నవతెలంగాణ-నిర్మల్

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఈనెల 23, 24 తేదీల్లో నిర్మల్ జిల్లాలో పర్యటిస్తారని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న శనివారం ఉదయం ఖానాపూర్ పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు, నిర్మల్‌లోని శ్రీ రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్ లో మధ్యాహ్నం 2 గంటలకు, 24న ఆదివారం ఉదయం భైంసాలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గస్థాయి సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, హాజరు కావాలని కోరారు.

శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు కృషి



- ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్ కుమార్
- కేంద్ర పారా మిలిటరీ దళాలతో సమావేశం

నవతెలంగాణ-రెబ్బెన

మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు కేటాయించబడ్డ కేంద్ర సాయుధ బలగాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలుతో పాటు ఎన్నికల నియమావళి ప్రకారం వాహనాల తనిఖీలు, ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా పటిష్ట మైన చర్యలు తీసుకోవాలన్నారు. దీనికోసం కేంద్ర సాయుధ బలగాలు పూర్తి సహకారం అందించాలని తమకు కేటాయించిన విధులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే స్పందించాలని సూచించారు. ఎన్నికలలో ప్రజలను ప్రభావితం చేయడానికి డబ్బు, మద్యం ఇతర సామాగ్రి జిల్లాలోనికి ప్రవేశించకుండా చెక్ పోస్టుల ద్వారా వివిధ శాఖల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రజలలో మనోధైర్యాన్ని నింపేలా ప్రతిరోజు పెట్రోలింగ్ నిర్వహించాలని తెలియజేశారు. ఎస్‌హెచ్‌ఒలు తమ ఏరియాపై పూర్తి అవగాహన కలిగి ఉండి అల్లర్లు సృష్టించేవారిని, పాత నేరస్తులను ముందుగా గుర్తించి, బైండోవర్ చేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాల్సిన భాద్యత మన అందరిపై ఉందని అన్నారు. ఎవరైనా విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన శాఖాపరమైన చర్యలుంటాయన్నారు. చెక్‌పోస్ట్‌లలో సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, రాత్రి సమయాల్లో తనిఖీ నిర్వహించేటప్పుడు రేడియం జాకెట్స్ ధరించాలన్నారు. వాహన తనిఖీ నిర్వహించే సమయంలో ఇతరులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. సమస్యను తగ్గించాలే కానీ మనమే సమస్యగా కాకూడదని తెలిపారు. గోలేటి టౌన్‌షిప్‌లో కేంద్ర సాయుధ పోలీసు బలగాల కోసం ఏర్పాటు చేసిన వసతి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కేంద్ర బలగాలతో సమన్వయం చేసుకుంటూ స్థానిక పోలీసులు పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, ఎస్బీ సీఐ రాణప్రతాప్, రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్ర శేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలలో పూర్తి సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సూచించారు. గురువారం స్థానిక పోచమ్మ బస్తీలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్)ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన సౌకర్యాల గురించి అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ ఆర్డీఓ సురేష్‌లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకు సిర్పూరు నియోజకవర్గంలో 320 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, నీడ, మూత్రశాలల సౌకర్యాలు ఉండాలని, వికలాంగులు, వయోవృద్దుల కోసం ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రానికి రాలేని దివ్యాంగులు, వయోవృద్దులు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

డిమాండ్స్ డేను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరిస్తూ, మీడియా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, షహీద్ భగత్ సింగ్ వర్ధంతి రోజైన మార్చ్ 23న దేశ వ్యాప్తంగా ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్(ఐజేయు) ఇచ్చినపిలుపు మేరకు శుక్రవారం నిర్వహించే జర్నలిస్ట్స్ డిమాండ్స్ డే విజయవంతం చేయాలని టీయుడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు రహమాన్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిమాండ్స్ డే సందర్భంగా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. మీడియా స్వేచ్ఛ కోసం ప్రభుత్వం వెంటనే ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టులు కోసం వేజ్ బోర్డును ఏర్పాటు తోపాటు ప్రధానమైన సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టు డిమాండ్స్ డే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లాలోని జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు జర్నలిస్టుల డిమాండ్స్ డేకు మద్దతు తెలిపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు హరికృష్ణ, రాధాకృష్ణ చారి, ఈర్ల సతీష్ కుమార్, రతన్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పని కల్పించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద గ్రామాలలో ఉపాధి హామీ కూలీలకు పూర్తి స్థాయిలో పని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి తెలిపారు. గురువారం జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, పంచాయితీరాజ్ ఈఈ ప్రభాకర్‌లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద గ్రామాలలో ఉపాధి కూలీలకు పూర్తి స్థాయిలో పనులు కల్పించాలని తెలిపారు. గ్రామాలలో ఉపాధి హామీ పనులకు సంబంధించి ఉపాధి హామీ కూలీల హాజరు శాతాన్ని పెంచాలని, దినసరి వేతనం పెంపొందించేందుకు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పనులను నిర్దేశించిన సమయానికి పూర్తి చేసే విధంగా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు.



ప్లాంటేషన్‌ను ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

అటవీ ప్రాంతంలో ఖాళీ ప్రదేశాలను గుర్తించి రాబోయే కాలంలో ప్లాంటేషన్ ఏర్పాటుచేయాలని, దీంతో అటవీ సంపద పెరగడమే కాకుండా వన్యప్రాణులకు సంరక్షణగా ఉంటుందని ఫారెస్టు అడిషనల్ ఇన్స్‌పెక్టర్ జనరల్ కైలాష్ భీంరావు అటవీ శాఖ సిబ్బందికి సూచించారు. గురువారం సిర్పూర్ రేంజ్ పరిధిలో ఇటుకల్‌పహాడ్, చీలపెల్లి బీట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్ నుండి మాలిని రోడ్డు వల్ల కోల్పోతున్న రిజర్వు ఫారెస్ట్ ప్రాంతానికి బదులుగా ఇటుకల్‌పహాడ్ బీట్‌లో ప్లాంటేషన్‌ను ఏర్పాటుచేయాలన్నారు. అనంతరం ఇటుకల్‌పహాడ్‌లో గతంలో నిర్మించిన ప్లాంటేషన్‌ను, మ్యాచాన్‌లను సందర్శించి, ఇటుకల్‌పహాడ్‌లోని బీగ్రేడెడ్ భూమిని పరిశీలించి దీనిలోనే ప్లాంటేషన్ ఏర్పాటుచేస్తే బాగుంటుందన్నారు. అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులకు భద్రత ఉంటుందని, సిర్పూర్ రేంజ్‌లో ప్రతిరోజు అటవీ ప్రాంతంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అటవిని, వన్యప్రాణులను వేటగాళ్ల ఉచ్చులో పడకుండా రక్షించాలని, సిర్పూర్ రేంజ్‌లో ఉన్న అటవీ భూములను గుర్తించి అన్యాక్రాంతం కాకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్, సిర్పూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి పూర్ణచందర్, సెక్షన్ ఆఫీసర్ మోహన్‌రావు, బీట్ ఆఫీసర్‌లు సాహిద్, నరేష్, నవీన ఉన్నారు.

నకిలీ సర్టిఫికెట్ల అధ్యాపకుడి తొలగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నకిలీ సర్టిఫికెట్లతో కాంట్రాక్టు ఉద్యోగాన్ని రెగ్యులరైజ్ చేయించుకున్న బెజ్జూర్ జూనియర్ కళాశాల గణిత అధ్యాపకుడు కలవేణి నాగరాజును ఉద్యోగంలో నుంచి తొలగిస్తు ఆర్జేడీ ఉత్తర్వులు విడుదల చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్ తెలిపారు. గత మే నెలలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే దీనిలో భాగంగా రెగ్యులర్ అయిన నాగరాజుపై ఫిర్యాదు రాగా విచారణ అనంతరం ఉద్యోగంలో నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పట్టణంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

నవతెలంగాణ-లక్షెట్టిపేట



లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో భరోసా కల్పించేందుకు లక్షెట్టిపేట పట్టణంలో గురువారం సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక గురునానక్ గార్డెన్ నుంచి ఉత్కూర్ చౌరస్తా మీదుగా ప్రారంభమై గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రజలకు నమ్మకం కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు తమ ఓటు హక్కును ఎలాంటి భయాందోళనకు లోను కాకుండా స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కవాతులో లక్షెట్టిపేట, సీఐ నరేందర్, ఎస్ఐ చంద్రకుమార్, ఏఎస్ఐ రామయ్య పాల్గొన్నారు.

ఐటీఐ వెల్డర్లకు అవకాశం కల్పించాలని వినతి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో ఇటీవల విడుదల చేసిన ఎక్స్‌టర్నల్ ఉద్యోగ నియామకాల్లో ఐటిఐ వెల్డర్లకు పోస్టులు కేటాయించాలని గురువారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డికి ఐటిఐ వెల్డర్లు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగ అవకాశం కోసం ఆశతో ఎదురు చూస్తున్న సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు రాజు పాల్గొన్నారు.



హామీలపై కాంగ్రెస్‌ను ఎక్కడికక్కడ నిలదీయాలి

- ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే సుమన్
- పార్టీ కార్యకర్తల సమావేశంలో దిశానిర్దేశం

నవతెలంగాణ-జైపూర్

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ఎక్కడికక్కడ నిలదీయాలని బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నియోజకవర్గం పరిధిలో మందమర్రి, రామకృష్ణాపూర్ పట్టణాలతో పాటు జైపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముందుగా లోకసభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహ ప్రతివ్యూహాలు, ప్రచారంలో అనుసరించాల్సిన విధి విధానాలపై కార్యకర్తలతో చర్చించారు. పెద్దపల్లి పార్లమెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను నాయకులకు, కార్యకర్తలకు పరిచయం చేస్తూ సుమన్ మాట్లాడారు. కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని, గత ఎన్నికల్లో ఓటమి చెందినందుకు ఎవరూ కూడా చింతించవద్దని, మొండి ధైర్యంతో ప్రజల సమస్యలపై పోరాడాలని అన్నారు. అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ పట్టుదల గల నాయకుడు జటిలమైన



రామకృష్ణాపూర్‌లో..



సమస్యలకు పరిష్కారం చూపుతాడని అనడానికి నిదర్శనం కేసీఆర్ అన్ని అన్నారు. కేసీఆర్ పాలన దేశంలో నెంబర్‌వన్‌గా నిల్చిందన్నారు. డబ్బుల కోసం పని చేసే నాయకున్ని కాదని, ప్రజల కోసం బతికే ప్రజాప్రతినిధినని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో అమలు చేసిన పథకాలు వివరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై ఆరోపణలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బలమూరి అరవిందరావు, డాక్టర్ రాజారమేష్, జాడి ఏసయ్య, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందమర్రి : లోక్‌సభ ఎన్నికల్లో ఉద్యమ పార్టీ బీఆర్ఎస్‌ను ఆదరించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ మంత్రి పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేసారు. గురువారం చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అధ్యక్షతన సీఈఆర్ క్లబ్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యమం నుంచి ఆవిర్భవించిన బీఆర్ఎస్ దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిందని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచిన కేసీఆర్‌కు దేశ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని అన్నారు. అబద్దాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ మోసపూరితమైన హామీలతో ప్రజలను మోసం చేస్తోందని వివరించాలని ప్రజలకు వివరించాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి రివర్స్ పంపింగ్ ద్వారా రైతులకు నీళ్ళు అందించామన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన మూడు నెలలకే సాగు నీరు అందక రైతులు గోస పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మందమర్రి పట్టణ అధ్యక్షుడు జె రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, పట్టణ ఇన్‌చార్జి బత్తుల శ్రీను, జడ్పీటీసీ వేల్పుల రవి, డాక్టర్ రాజా రమేష్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక సూపర్ బజార్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బాల్క సుమన్ మాట్లాడుతూ రానున్న లోక్ సభ ఎన్నికలలో అనుసరించాల్సిన విధానాలను దిశా నిర్దేశం చేశారు.



మందమర్రిలో..

27, 28న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



నవతెలంగాణ-హాజీపూర్

ఎస్ఎఫ్ఐ 4వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాగమ్ శ్రీకాంత్, మిట్టపల్లి తిరుపతి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కాలేజీలో మహా సభల పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 27, 28 తేదీల్లో మంచిర్యాలలో మహా సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ విద్యార్థుల సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తున్న 100 మంది విద్యార్థి ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొంటున్నారన్నారు. ఈ మహాసభలలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలుపై చర్చించి, భవిష్యతు కార్యచరణను రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఈదునూరు అభినవ్, సానియా, గాయత్రి, యాసీన్, పనశ్రీ, నవ్య పాల్గొన్నారు.

ఐకేపీ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్



నవతెలంగాణ-దండేపల్లి

ఐకేపీ సంఘాల ద్వారా రబీలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని సంఘాల మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వీవోఏలు, గ్రామైక్య సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్ కుట్టే బాధ్యతను ప్రభుత్వం సంఘాలకు అప్పగించిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. వచ్చే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు సభ్యులు కృషి చేయాలని ఆయన సూచించారు. ఎన్నికలకు సంబంధించిన స్వీప్‌పై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్ సంధ్యారాణి, డీపీఎం వేణుగోపాల్, ఏపీఎం బ్రహ్మయ్య మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అల్లంల అనిత పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద పకడ్బందీగా తనిఖీలు

- రాత్రి పూట రేడియం జాకెట్లు ధరించాలి
- రామగుండం సీపీ శ్రీనివాస్



నవతెలంగాణ-జైపూర్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో ఇరువై నాలుగు గంటలు తనిఖీలు చేపట్టాలని రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ ఆదేశించారు. ఇందారం శివారు గోదావరి నది వంతెన వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదావరి వంతెన మీదుగా వచ్చిపోయే వాహణాలను తనిఖీలు చేయాలని సూచించారు. బస్సులు, ద్విచక్రవాహణాలను సైతం తనిఖీ చేయాలని, వాహణాల తనిఖీ సమయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. రాత్రి సమయంలో విధులు నిర్వర్తిస్తున్న వారు తప్పకుండా రేడియం జాకెట్ ధరించివుండాలని అన్నారు. అక్రమంగా డబ్బు, మద్యం, బంగారం, విలువైన వస్తువులు తరలిస్తే వాటిని పట్టుకోవాలని తెలిపారు. వ్యక్తిగతంగా రూ.50 వేల కంటే ఎక్కువగా డబ్బు తీసుకెల్తున్నప్పుడు తగిన ధ్రువపత్రాలు కలిగివుండాలని తెలిపారు. ఎలాంటి పత్రాలు లేనప్పుడు సీజ్ చేసిన డబ్బును గ్రీవెన్స్ కమిటికి అప్పగించాలని పేర్కొన్నారు. రూ.10 లక్షలకు మించిన డబ్బు ఉన్నప్పుడు సదరు డబ్బును సీజ్ చేసి వెంటనే ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌కు సబ్‌మిట్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీ శ్రీనివాస్‌తో పాటు గోదావరిఖని ఏసీపీ రమేష్, సీఐ ఇంద్రసేనా రెడ్డి పాల్గొన్నారు.

గని ప్రమాదంలో కార్మికునికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి-1 గనిలో గురువారం జరిగిన ప్రమాదంలో హామర్ మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న సాదం సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. కార్మికుడు ఉదయం షిఫ్ట్‌లో రోప్ స్ప్లైసర్ 6వ సీమ్ 7వ లెవల్ పుల్లిని సరిచేస్తుండగా రెండు కాళ్ల పుల్లిలో ఇరుక్కున్నాయి. దీంతో రెండు పాదాలు పూర్తిగా తెగిపోయాయి. వెంటనే ఏరియా సింగరేణి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్య నిమిత్తం కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రికి తరలించారు.



ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ రక్షణపై లేదు : కార్మిక సంఘాలు

సింగరేణి యాజమాన్యానికి ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల రక్షణపై లేదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి మండిపడ్డారు. ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని చేరుకోవడానికి కార్మికులపై ఒత్తిడి తీసుకొచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. పని స్థలాలలో ఉండాల్సిన రక్షణ పరికరాలు నామాత్రంగానే ఉంటున్నాయన్నారు. రక్షణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రమాదానికి కారణమవుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం(బిఎంఎస్) ఏరియా కార్యదర్శి నాతాడు శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడంపై దృష్టి సారించి రక్షణ నియమాలు పూర్తిగా విస్మరిస్తోందని ఐఎన్‌టియుసి ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకరరావు ఆరోపించారు.

ప్రజాపాలనతో ప్రజలకు మరిన్ని సేవలు



నవతెలంగాణ-జైపూర్

ప్రజాపాలన నిరంతరం కొనసాగుతుందని దాని ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని కాంగ్రెస్ నాయకుడు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫయాజోద్దీన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కారమార్గం చూపిస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ హైదరాబాద్‌లో ఉండి నెల రోజులకు ఒక సారి నియోజకవర్గం కేంద్రానికి వచ్చి సుడిగాలి పర్యటన చేశారని విమర్శించారు. పేదలకు న్యాయం జరుగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు. రాబోయే లోక సభ ఎన్నికల్లో పెద్దపల్లి పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యతమ మనపై ఉందని పేర్కొన్నారు. బాల్క సుమన్ నియంతగా వ్యవహరించాడని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనిచివేత ధోరణి అవలంబించారని ఈ సంధర్భంగా ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఆరోపనలు చేయడం సిగ్గు చేటని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిపై అనుచిత వాఖ్యలు చేస్తున్న బాల్క సుమన్ తీరును తప్పుబట్టారు. ఇప్పటికైనా మాట తీరు మార్చుకోవాలని ఈ సందర్భంగా బాల్క సుమన్‌ను హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కోఆప్షన్ మెంబర్ జైనోద్దీన్, మంతెన లక్ష్మన్, సంపత్ రెడ్డి, తిరుపతిరాజ్, మల్లయ్య, శీలం వెంకటేశం, మనోహర్, రమేష్ పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్



నవతెలంగాణ-హాజీపూర్

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. గురువారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో టీఎస్ 19 టీ 5869 నెంబర్‌గల లారీ అనుమానాస్పదంగా వెళ్తుండగా ఆపి చెక్ చేయగా మంచిర్యాల గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి సీజ్ చేశామని తెలిపారు.

దొంగతనానికి విఫలయత్నం

- కేసు నమోదు చేసిన పోలీసులు



నవతెలంగాణ-మందమర్రి

పట్టణంలోని లక్ష్మిభవాని కాలనికి చెందిన మేకల లక్ష్మణ్ ఇంటో దొంగతనానికి యత్నించిన వారిపై కేసు నమోగు చేసినట్టు మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. గురువారం రాత్రి 2:00 గంటల సమయంలో మేకల లక్ష్మణ్ ఇంట్లోకి ముగ్గురు దొంగలు ప్రవేశ మార్గాన్ని ధ్వంసం చేసి ప్రవేశించారు. ఇంటిలోనే ఉన్న లక్ష్మణ్ శబ్దాలు గ్రహించి ఫోన్ ద్వారా చుట్టుపక్కల వారికి సమాచారం అందించగా వారు శబ్దాలు చేయడంతో దొంగలు అక్కడి నుంచి పారిపోయారు. పట్టణం వేగంగా విస్తరిస్తున్నందువలన కొత్త కాలనీలు ఏర్పడుతున్నాయని, ఇండ్లు దూరం దూరంగా ఉండటంతో దొంగతనం జరగడానికి ఎక్కువ అవకాశం ఉంటుందని యజమానులు స్వీయ రక్షణ కోసం ఇంటి పరిసరాలతో పాటు కాలనీలోకి వచ్చి పోయే దారులలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇండ్లలో విలువైన ఆభరణాలు, వస్తువులు ఉంచుకోకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. రాత్రిపూట అలజడి ఏర్పడినా, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు తెలిసిన డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ సూచించారు.

గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-మందమర్రి

గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిపై మందమర్రి పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం దొరల బంగ్లా ప్రాంతంలో మనుపాటి సంపత్ గుడుంబా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 6 లీటర్ల గుడుంబా లభించగా సంపత్‌ను అదుపులోకి తీసుకొన్నారు. అక్రమ సంపాదన కోసం నెన్నెల మండలానికి చెందిన వ్యక్తి నుంచి గుడుంబాను కొనుగోలు చేసి స్థానికంగా అమ్ముతున్నట్లు విచారణలో తేలింది. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

ఓటరు నమోదుపై అవగాహన

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య కార్యాలయం గురువారంలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి, పాల్గొని, ఓటరు నమోదుపై సిబ్బందికి అవగాహన కలిగించారు. ఓటు హక్కు అనేది ప్రతి పౌరునికి రాజ్యాంగం కల్పించిన హక్కు, అందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా నూతనంగా 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటు హక్కును కల్పించే విధంగా చూడవలసిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. అదేవిధంగా మంచిర్యాల డీఆర్‌డీఓ కిషన్ పాల్గొని బ్యాంకు లింకేజీ లో 100 శాతం లక్ష్యాన్ని అధిగమించినందుకు సిబ్బందిని అభినందించారు. వరి కొనుగోలు కేంద్రాలను మహిళలు సమర్థవంతంగా నిర్వహించాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. స్త్రీ నిధి, ఎంటర్ప్రైజెస్, రుణ వసూళ్ల తదితర అంశాలను ఐకేపీ సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో డీపీఎ మార్కెటింగ్ వేణుగోపాల్, ఏపీఎం బుచ్చన్న పాల్గొన్నారు.





బదిలీపై వెళ్తున్న మేనేజర్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-మందమర్రి

ఆర్కే ఓసి మేనేజర్ సిహెచ్ వెంకటేశ్వర్లు బదిలీపై ఇందారం ఓసి మేనేజర్‌గా వెళ్తున్న సందర్భంగా గురువారం జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో జీఎం మనోహర్ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు ఏరియాలో చేసిన సేవలను అధికారులు గుర్తు చేస్తూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ఎం రవీందర్, ఆర్కే ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, కేకే ఓసి ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, డీజీఎం ఐడి రాజన్న, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఎస్కె గ్రూప్ ఏజెంట్ విజయప్రసాద్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నవతెలంగాణ-దండేపల్లి

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గురువారం మండలంలోని మాకులపేట, గుడిరేవు, అల్లీపూర్, నాగసముద్రం, లింగాపూర్, బిక్కనగూడ, మేదరిపేట్, లక్ష్మీకాంతపూర్ గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సంధ్యారాణి పరిశీలించారు. ఎన్నికలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా శాంతియుత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనుమానం ఉన్న వాహనాలపై దృష్టి పెట్టి తనిఖీలు నిర్వహిస్తున్నామని, సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంచుతున్నామని తెలిపారు. ఆమె వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భూమన్న, సిబ్బంది ఉన్నారు.

అక్రమ మద్యం పట్టివేత
నవతెలంగాణ-కుభీర్



మండలంలోని పార్డి(బి) గ్రామంలో గురువారం అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్టు కుభీర్ ఎస్సై రవీందర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో గురువారం గ్రామాల్లో అక్రమంగా విక్రయిస్తున్న బెల్ట్ షాపులలో తనిఖీలు నిర్వహించడంతో పార్డి(బి) గ్రామానికి చెందిన పాపయ్య అనే వ్యక్తి వద్ద 7.2లీటర్ల మద్యం సీసాలు లభించడంతో వాటి విలువ సుమారు రూ.7,920 ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉండటంతో ఎలాంటి మద్యం కానీ రూ.50వేలకు పైగా ఉన్నట్లయితే వాటిని పట్టుకొని సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఆయన వెంట ఏఎస్సై యశ్వంత్ ఉన్నారు.

వడగండ్ల వానకు 76 ఎకరాల్లో పంట నష్టం
నవతెలంగాణ-జన్నారం



మండలంలోని తిమ్మాపూర్, రాంపూర్, తపాలాపూర్, చింతగూడ సింగరాయపేట గ్రామాలలో బుధవారం వడగళ్ల వానకు మొత్తం ఆ గ్రామాల్లో 76 ఎకరాల పంట నష్టం వాటిలిందని, మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత తెలిపారు. అందులో 11 ఎకరాల మొక్కజొన్న, పెసర మినుములు, యాసంగి, నువ్వులు, ఉన్నాయన్నారు. పంట నష్టం అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. రైతులు ఆందోళన పడవద్దని సూచించారు. తిమ్మాపూర్ గ్రామ రైతులు, గుండ నరసయ్య అలస నరసయ్య, జునుగురి మల్లయ్య జాడి పోచన్న, జనవరి లింగన్న, కూకటిగారి శంకర్, కామర శంకర్, కామెర బానయ్య పాల్గొన్నారు.

దేగామ గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తా..
- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

మండలంలోని దేగామ గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో దేగామ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు పలు సమస్యలను విన్నవించారు. తమ గ్రామంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడంతో పాటు పేదలకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని అన్ని సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుభాష్ పటేల్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు కిష్టయ్య,, బీజేపీ మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు సిరం సుష్మరెడ్డితో పాటు పలువురు ఉన్నారు.

డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన
నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డయల్ యువర్ డీఎం కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలను, అర్జీలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన తెలిపారు. గురువారం నిర్వహించిన డయల్ యువర్ కార్యక్రమానికి స్పందన లభించింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఫిర్యాదులు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా బస్సు సౌకర్యం కల్పించాలని, బస్సుల సంఖ్య పెంచాలని, ఆదిలాబాద్ నుంచి షిరిడికి ప్రత్యేక బస్సు సర్వీస్ కల్పించాలని, తదితర సమస్యలను విన్నవించారు. ఈ మేరకు వచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డిపో మేనేజర్ తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు బస్సులు నడిపిస్తామన్నారు.

గుడుంబా పట్టివేత



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలంలోని భూర్గుపల్లి(జి) గ్రామంలో రూ.4,400 విలువగల 11 లీటర్ల గుడుంబాను పోలీసు పట్టుకున్నారు. ఎస్సై హనుమండ్లు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం రోజున భూర్గుపల్లి(జి) గ్రామంలో అక్రమంగా గుడుంబా కలిగియున్నాడన్న సమాచారం మేరకు రాథోడ్ గోవింద్‌ను స్థానిక ఎస్సై తన సిబ్బందితో గుట్టుగా పట్టుకున్నాడు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని, ఇంకెవరైనా గుట్టు చాటున గుడుంబా అమ్మడం గానీ, తయారు చేయడం గానీ చేసినట్లయితే వారిపై చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం
నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ రచయితల వేదిక నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో డాక్టర్ దామెర రాములు నిర్మల్ నర్సింగ్ హోమ్‌లోని సాహితీ క్షేత్ర సమావేశం మందిరంలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు దామెర రాములు మాట్లాడారు. ప్రజలను చైతన్యవంతం చేయడంలో కవిత్వం, కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కవిత్వం లేని సమాజాన్ని ఊహించలేమని అన్నారు. కవులు ఎప్పుడు ప్రజల వైపు నిలబడతారని అన్నారు. మానవ సంబంధాలను కవిత్వం మాత్రమే వ్యక్తం చేస్తుందని, కవి సత్యం వైపు నిలబడి కవిత్వం రాస్తారని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు నేరెళ్ల హనుమంతు, సలహా సభ్యులు పత్తి శివప్రసాద్, కోశాధికారి పోలీస్ భీమేష్, సంపత్‌లు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని నిపాని, పిప్పల్‌కోటి గ్రామాలలో బుధవారం రాత్రి బెల్ట్ షాపుల్లో అక్రమంగా మద్యాన్ని అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై తమ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. రూ.690 విలువ గల 13 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిపాని గ్రామానికి చెందిన నిమ్మల సంజీవ్, పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన గుగ్గిళ్ల రవిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపారు.

మట్కా నిందితుడి అరెస్ట్ : నగదు స్వాధీనం
నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలంటే జిల్లా ప్రజల సహకారం ఎంతగానో అవసరమని ఆదిలాబాద్ సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. పోలీసు బృందంతో ఆదిలాబాద్‌లోని స్పిన్నింగ్ మిల్ ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్న షేక్ రఫీక్‌ను గురువారం పట్టుకుని, ఆయన నుంచి రూ.11,100 నగదు, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకొని, 2టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల పట్ల సెక్టోరల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలి
- ఆసిఫాబాద్ ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా సెక్టోరల్ అధికారులు, సెక్టోరల్ పోలీసు అధికారులు తాము నిర్వర్తించాల్సిన విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం వంజీరి రైతు వేదికలో నోడల్ అధికారులు, సెక్టోరల్ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సిర్పూర్ నియోజకవర్గంలో 320, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 356 పోలింగ్ కేంద్రాలు ఎర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ప్రీపోల్, పోల్, పోస్ట్ పోల్ విడతలుగా ఎన్నికల నిర్వహణలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ రోజున పోలింగ్ ప్రారంభానికి ముందు తప్పనిసరిగా మాక్ పోల్ నిర్వహించాలని, ఇందు కొరకు పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పోలింగ్ ముందు రోజు ప్రతి సెక్టోరల్ అధికారి తన పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఎన్నికల సామాగ్రి, టేబుళ్ల అమరిక, పోలింగ్ కేంద్రానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కల్పించిన ఏర్పాట్లను పరిశీలించాలని, అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. పోలింగ్ రోజున మాక్ పోలింగ్ ప్రక్రియలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలలో సమస్య తలెత్తినట్లయితే వెంటనే పరిష్కరించడానికి కృషి చేయాలని అన్నారు. ఉదయం 7 గంటలకు అసలు పోలింగ్ ప్రారంభించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో జరిగే ఓటింగ్ ప్రక్రియను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి సరిపడా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లతో పాటు అదనంగా అందించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సంబంధిత ప్రతి అంశంపై సెక్టోరల్ అధికారులకు





అవగాహన ఉండాలని, పోలింగ్ రోజున వచ్చే ఛాలెంజ్, టెండర్ ఓట్ల గురించి తెలుసుకోవాలని అన్నారు. సెక్టోరల్ అధికారులకు అందించే చెక్ లిస్ట్, హ్యాండ్ బుక్, చేసేవి, చేయకూడని పనుల సంబంధిత పుస్తకాలను పూర్తిగా చదివి దగ్గర ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పకడ్బందీగా చర్యలు చేపట్టాలని తెలిపారు. నోడల్ అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, మ్యాన్‌పవర్, సామాగ్రి నిర్వహణ, కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ, స్వీప్, శాంతిభద్రతల పరిరక్షణ, ఈవీఎం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, సీవిజిల్, ఖర్చుల పర్యవేక్షణ, బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, పత్రికా ప్రకటనలు, మీడియాతో సమాచార మార్పిడి, కమ్యూనికేషన్ ప్లాన్, దివ్యాంగుల సౌకర్యాల నిర్వహణ, పోలింగ్ పర్యవేక్షణ, ఎలక్టోరల్ రోల్, ఓటర్ హెల్ప్‌లైన్, లైజన్ అధికారుల ఏర్పాటు, రీడింగ్ సామాగ్రి, రవాణా, భద్రత, టెలిఫోన్ కనెక్టివిటీ, కంప్యూటర్లు, ప్రింటర్ల ఏర్పాటుతో పాటు ఎన్నికల సంబంధిత ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాలో ఎన్నికలు సజావుగా సాగేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ సురేష్ కుమార్, కాగజ్‌నగర్ ఆర్డీఓ సురేష్, నోడల్ అధికారులు, సెక్టోరల్ అధికారులు, సెక్టోరల్ పోలీసు అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు రూ.60 వేల నగదు పట్టివేత
నవతెలంగాణ-కాసిపేట

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి సమీపంలోని పోలీస్ చెక్ పోస్ట్ వద్ద గురువారం సాయంత్రం కాసిపేట ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రాయపట్నంకు చెందిన గటికె అంజి అనే వ్యక్తి వద్ద ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.60వేల నగదు తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని, పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసిన నగదును తదుపరి చర్యల కోసం ఎస్ఎస్టీ టీంకు అప్పగించినట్లు ఎస్సై పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం



నవతెలంగాణ-జన్నారం

అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవం గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు అటవి ప్రాముఖ్యతపై వ్యాసర రచన, చిత్రలేకనం పోటీలు నిర్వహించారు. అనంతరం ఫారెస్ట్ సిబ్బంది, బేస్ క్యాంప్ వాచర్స్ విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జింకల పార్క్ వద్ద స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జన్నారం ఎఫ్ఆర్ఓ లక్ష్మీనారాయణ, ఇందన్‌పల్లి ఎఫ్ఆర్ఓ ఆఫీస్ ఉద్దీన్‌లు మాట్లాడుతూ అడవులను రక్షించుట అందరి బాధ్యత అన్నారు. అడవులు ఎక్కువగా ఉంటేనే వాతావరణం సమతుల్యతగా ఉంటుందన్నారు. అడవులను కాపాడుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో బోడ ఓంకారేశ్వర్ పాల్గొన్నారు.

మైనింగ్ సర్దార్ కుటుంబానికి చెక్కు అందజేత
నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనికి చెందిన, సీనియర్ మైనింగ్ సర్దార్ మచ్చ రమేశ్ గత జనవరిలో మృతి చెందగా ఆయన కుటుంబానికి రావాల్సిన ఎక్స్‌గ్రేషియా, స్పెషల్ ఎక్స్‌గ్రేషియా బెనిఫిట్స్ రూ.15,90,000 చెక్కును గని మేనేజర్ లక్ష్మీనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ చేతుల మీదుగా అందించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గని ప్రమాదంలో గుర్తించి కుటుంబానికి ఉద్యోగం, పరిహారం ఇవ్వాలని ధర్నా చేయడంతో యాజమాన్యం అంగీకరించినట్లు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ వివరించారు. ఈ కార్యక్రమంలో గని వెల్ఫేర్ ఆఫీసర్ భార్గవ్, సర్వే ఆఫీసర్ ప్రకాశ్, పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



వైద్యం కోసం బాపూజీకి బెయిల్ ఇవ్వాలి
నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సంత్ శ్రీ ఆశారామ్ బాపూజీ ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో ఉత్తమ వైద్యం కోసం కోర్టు బెయిలు ఇవ్వాలని భక్తులు నీలు బహేన్ అన్నారు. గురువారం గాంధీ ప్రింటింగ్ ప్రెస్ సమీపంలోని ఆశారామ్ బాపూజీ ఆశ్రమం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ సాగుతూ కలెక్టరేట్ వరకు చేరుకున్నారు. కలెక్టర్ కార్యాయలం ప్రధాన గేటు ఎదుట బైటాయించి, బాపూజీకి బెయిల్ మంజూరు చేయాలని నినాదాలు చేశారు. ర్యాలీలో దారి పొడవునా ఆశారామ్‌కు మద్దతుగా ప్లకార్డులను ప్రదర్శిస్తు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నీలు బహేన్ మాట్లాడుతూ గత 11 ఏండ్లుగా ఆశారాం బాపూజీకి బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రాంరహీంకు బెయిల్ వస్తుందని, ఆశారాం బాపుకు ఎందుకు రాదని ప్రశ్నించారు. ఆయన ధర్మ రక్షణ కోసం ఎంతో మందిని ఏకం చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్షీస్తున్న క్రమంలో కోర్టు మానవత దృక్పతంతో ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్త ఆందోలనల చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగ్‌పూర్ సమితి అధ్యక్షుడు శోభారాం బాయి, ఆదిలాబాద్ అధ్యక్షురాలు పొచ్చన్న, అల్కా బహెన్, చాయ బహెన్, మురళి, త్రిశూల్ పాల్గొన్నారు.

పోలీసు తనిఖీల్లో రూ.70వేల పట్టివేత



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద గురువారం నిర్వహించిన పోలీసు తనిఖీల్లో రూ.70వేల నగదు పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై హనుమండ్లు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... మధ్యాహ్న సమయంలో పోలీస్ స్టేషన్ ముందర పోలీసు సిబ్బందితో వాహనాలు తనిఖీలు చేస్తుండగా నాందేడ్‌కు చెందిన ఇర్ఫాన్‌ఖాన్ అనే వ్యక్తి ఎలాంటి పత్రాలు లేకుండా రూ.70 వేల రూపాయలు తీసుకెళ్తున్నాడని, ఆ నగదును స్వాధీనం చేసుకొని తదుపరి చర్యల కొరకు నిర్మల్ సీటీఓ(కలెక్టర్ ఆఫీస్)కు పంపామని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఎక్కువ మొత్తంలో డబ్బు తరలించవద్దని ఎస్సై సూచించారు.

ఇంటి వద్దే ప్రసవం చేసిన 108 సిబ్బంది
నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని పెద్దాపూర్ ఆదివాసీ గిరిజన గ్రామంలో 108 సిబ్బంది గర్భిణీకి ఇంటి వద్దే ప్రసవం చేశారు. పెద్దాపూర్‌కు చెందిన వెడ్మ స్వప్నకు 9 నెలలు నిండి నొప్పులు రావడంతో స్థానిక ఆశా వర్కర్ 108కు ఫోన్ చేయగా గ్రామానికి చేరుకోవడంతో అప్పటికే గర్భిణీకి నొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్స్‌లో కూడా ఎక్కించే పరిస్థితి లేకపోవడంతో ఇంటి వద్దే ప్రసవం చేశారు. ఆడ శిశువుకు జన్మనివ్వగా తల్లీబిడ్డలు ఇద్దరు క్షేమంగా ఉండగా, ప్రాథమిక చికిత్స అందించి కాసిపేట ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎంఈటీ అత్మారావు, పైలట్ రాజేశంకు కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రపంచ అటవీ దినోత్సవ వేడుకలు
నవతెలంగాణ-హాజీపూర్

ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అటవీశాఖ అధికారులు క్వారీ రోడ్డులో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. చెత్తను ఊడ్చి సేకరించి, డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు అతహుల్ల, అహ్మద్, విజయ్, బీట్ ఆఫీసర్లు తిరుపతి, ఉషారాణి, రత్న సింధు, శ్రీను, కవిత, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. గురువారం కాంగ్రెస్ నిర్మల్ మండల నూతన కార్యవర్గ సభ్యులు, జిల్లా కేంద్రంలోని కేఎస్ఆర్ క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారమే ఇప్పటికే నాలుగు గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు బలమైన కార్యకర్తలు ఉన్నారని వెల్లడించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేసే బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా ఎవరికి అవకాశం వచ్చినా కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నుంచి జీవరాశులను కాపాడుదాం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

వేసవి కాలం నేపథ్యంలో నీటి ఎద్దడి నుంచి జీవరాశులను కాపాడుదామని, తాగు నీటి ఎద్దడి ఏర్పడకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ అరుణరాణి పేర్కొన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వేసవిలో ముఖ్యంగా పశువుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన వివిధ ప్రాంతాల నీటి తొట్టిలను నిండుగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ ద్వారా అందించే శుద్ధ జలాన్ని ఆటంకం లేకుండా చూడాలని, తగు సూచనలు చేశారు. వేసవిలో జీవరాశిని నీటి ఎద్దడి నుంచి కాపాడుదామని తెలిపారు. తాగు నీటి సరఫరాలో ఆటంకం కలగకుండా ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. పశువుల నీటి తొట్టెల వద్ద ఇంకుడు గుంతల విధానాలను అమలు చేస్తామని, ఎంపీఓ అజీజ్ ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.స్వాతి, వైద్యాధికారి డాక్టర్ శ్యాంకుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల నూతన కమిటీ ఎన్నిక
నవతెలంగాణ-రామకృష్ణాపూర్

క్యాతనపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల నూతన కమిటీని మహేందర్ అధ్యక్షతన గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్ హాజరయ్యారు. అధ్యక్షులుగా ఎం మహేందర్, కార్యదర్శి వెమూర్ల ఎల్లయ్య, ఉపాధ్యక్షుడిగా జి రాజశేఖర్, సహాయ కార్యదర్శి ఎం.నారాయణ, కోశాధికారి జె దేవావరం, ప్రచార కార్యదర్శి కాసర్ల తిరుపతి, కమిటీ సభ్యులుగా కూనరపు సరోజన, బి రవి, ఐ రాజాం, సిహెచ్ పోషం, కాసర్ల కుమార్, సిహెచ్ రాజు, వెంకట్ ఎన్నికయ్యారు. అనంతరం దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను గుర్తించి కనీస వేతనం రూ.26,000 చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.